క్రీస్తుమార్గం అనుసరణీయం

జిల్లా వ్యాప్తంగా గుడ్ ఫ్రై డే

మహబూబాబాద్ రూరల్: కరుణామయుడు ఏసు క్రీస్తు అని, క్రీస్తుమార్గం అనుసరణీయం అని సీఎస్ఐ ప్రాస్బేటర్ చైర్మన్ రెవరెండ్ ఫాదర్ బి.ధర్మయ్య అన్నారు. గుడ్ ఫ్రైడే జిల్లా కేంద్రంలోని వివిధ చర్చిల్లో శుక్రవారం జరుపుకున్నారు. క్రీస్తు ఆరాధకులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బిలీవర్స్ చర్చిలో ఫాదర్ రెవరెండ్ ప్రేమానందం, స్టెల్లా మేరీ గ్రేస్ క్రీస్తు ఆరాధకులను ఉద్దేశించి ప్రసంగించారు. ఏసుశక్తి సహవాస చర్చిలో షీబారాణి, పాస్టర్ లివింగ్ వాటర్ గుడ్ ఫ్రైడే విశిష్టతను వివరించారు. ఏసుక్రీస్తు మన పాపాలను భరించి, మనలను విడుదల చేసిన రోజును గుడ్‌ఫ్రై డే పండుగగా జరుపుకుని ఆయనను ఆరాధిస్తామని తెలిపారు. లోక మానవాళి పాప విమోచనం కోసం మనపై పడాల్సిన శిక్షను ఏసుక్రీస్తు తానే శిలువను భరించి ప్రాణాలు అర్పించారని పాస్టర్ బ్రదర్ అనుదీప్ అన్నారు. పట్టణంలోని కాకతీయ కాలనీలో గల ఇండియన్ పెంతెకోస్తు (ఐపీసీ) చర్చిలో నిర్వహించిన గుడ్ ఫ్రైడే వేడుకల్లో రెవరెండ్ మోజేష్ క్రీస్తు ఆరాధకులను ఉద్దేశించి ప్రసంగించారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్ లోగల ఆగాపే ఫుల్‌గాస్పల్ చర్చిలో గుడ్ ఫ్రైడే నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ అండ్ లే లీడర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ పిల్లి కుమారస్వామి, డోలు రాములుసరిత, చేతిసతీష్, సంతోష్ పాల్గొన్నారు.

కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే జరిగాయి. పాస్టర్ జాన్ మార్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

డోర్నకల్: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రై డే క్రైస్తవులు జరుపుకున్నారు. మానవులను పాపాల నుంచి కాపాడేందుకు ఏసుక్రీస్తు సిలువను ఎత్తుకొని తన రక్తాన్ని దారపోసిన రోజును క్రైస్తవులు గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటారు. ఆర్‌సీఎం, ఎపిఫనీ చర్చిలతోపాటు మండలంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రధాన వీధుల మీదుగా ఏసుక్రీస్తు సిలువ యాత్ర నిర్వహించారు.

దంతాలపల్లి: మండలకేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో గుడ్ ఫ్రైడే నిర్వహించారు. ఈసందర్భంగా మండల కేంద్రంలోగల జేసీఎం చర్చిలో పాస్టర్ డేవిడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

చిన్నగూడూరు: మండలంలోని ఆయా చర్చిల్లో క్రైస్తవులు ఉదయం నుంచి ఏసు సిలువతో గీతాలు ఆలపిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గార్ల: గార్లలోని ఇందిరానగర్ ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో క్రిస్టియన్లు ఏసుప్రభువు సిలువను మోస్తూ, భటులుగా వేశాధారణ ధరించి గార్ల పురవీధుల్లో నిర్వహించిన ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.


మహబూబాబాద్ రూరల్: ఎల్షడ్డాయ్ చర్చిలో ప్రసంగిస్తున్న బ్రదర్ అనుదీప్


కేసముద్రం: వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు


డోర్నకల్‌లో క్రీస్తు సిలువ యాత్ర..


గార్ల: సిలువ మోస్తున్న క్రీస్తు ఆరాధకుడు


చిన్నగూడూరు: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


నెల్లికుదురు: మండల కేంద్రంలో..


దంతాలపల్లిలో..

కార్యక్రమంలో ఫాదర్ దిలీప్‌కుమార్, కిరణ్‌కుమార్, షాలిట్, జైస్, రోష్మి, బాలస్వామి, రమేష్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజ్యాంగ రక్షణ యాత్రను విజయవంతం చేయాలి



నెల్లికుదురు: మహనీయుల మాసోత్సవంలో భాగంగా ఏప్రిల్ 2నుంచి 8వరకు నిర్వహించే రాజ్యాంగ రక్షణ యాత్రను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, నాయకులు, మేధావులు, బహుజనులకు పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గార ఉపేందర్, సంజీవ, రజిని, యాకయ్య, వీరన్న, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి హోమం



మహబూబాబాద్ రూరల్: సంకష్టహర చతుర్థి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీతారామచంద్ర స్వామివారి దేవాలయంలో శుక్రవారం లక్ష్మీగణపతి హోమం పూజను ఆలయ ప్రధాన అర్చకులు ఎంవీ.కృష్ణప్రసాద్, గుడి రాధాకృష్ణమూర్తి ఘనంగా నిర్వహించారు. పలువురు దంపతులు లక్ష్మీగణపతి హోమంలో పాల్గొని పూజలు చేశారు.

'జలబిందెల' పూజలు



కురవి: సీరోలు మండలం చింతపల్లి గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవం కాటమయ్య ఉత్సవంలో భాగంగా జలబిందెల కార్యక్రమాన్ని గౌడ కులస్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ పాల్గొని పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



డోర్నకల్: మండలంలోని అమ్మపాలెం గ్రామంలో జరుగుతున్న శ్రీదేవి, భూదేవి, గోదా సమేత శ్రీవేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. నాలుగు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో శనివారం తెప్పోత్సవం, ఆదివారం అభిషేకాలు, అలంకరణలు జరగనున్నాయి.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



తొర్రూరు రూరల్: బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన కాల్వకోలన్ ప్రవీణ్‌రాజును భట్రాజు సంఘం నాయకులు శుక్రవారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రతికంతం దేవేందర్, జిల్లా కోశాధికారి నన్నపురాజు నారాయణరాజు పాల్గొన్నారు.

రోడ్డుపై పెసర పంట

పొంచి ఉన్న ప్రమాదం



కురవి: మండలంలోని నేరడ శివారు భంగ్యా తండా నుంచి తట్టుపల్లి వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిపై రైతులు పెసర పంటను తెచ్చి శుక్రవారం పోశారు. నూర్పిడి కోసం తెచ్చి రోడ్డుపై పోయడంతో ఆ మార్గంలో వచ్చిపోయే వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. కాగా రైతులకు పోలీసులు అవగాహన కల్పించి, రోడ్లపై పంట దినుసులు పోయకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

మూడో రోజు కొనసాగిన జాతర

గంగారం: మండలంలోని పుట్టల భూపతి గ్రామానికి చెందిన సోలం వారి ఇలవేల్పు 6వ గొట్టు బెరం బోయిన గోత్రం అయిన పెద్దగాదె రాజు-చిన్న గాదెరాజు జాతర మూడో రోజు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

కూలీల కనీస వేతనం రూ.500లకు పెంచాలి

కేసముద్రం: ఉపాధి హామీ పథకంలో కూలీలకు కనీస వేతనాన్ని రూ.500 పెంచాలని హ్యూమన్ రైట్స్ ఆఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వలసల నివారణ కోసం చేసిన ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాన్ని పెంచాలన్నారు. పని ప్రదేశంలో వైద్య సేవలందించాలని పేర్కొన్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఖానాపురం : రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని బుధరావుపేటలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బుధరావుపేటకు చెందిన ఉబేద్ జాతీయ రహదారి దాటుతుండగా నర్సంపేట నుంచి గూడూరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొంది. దీంతో తలకు, శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఉబేద్‌ను చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు.

హుస్సేన్‌నాయక్‌కు ఘన సన్మానం

మహబూబాబాద్ అర్బన్: ప్రధాని మోదీ గిరిజనులకు పెద్దపీట వేస్తున్నారని, దీనికి నిదర్శనం హుస్సేన్‌నాయక్‌కు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమించడమే అని రాజ్యసభ మాజీ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు అన్నారు. ఎడ్ల అశోక్ ఆధ్వర్యంలో జాటోతు హుస్సేన్ నాయక్ సన్మానం సందర్భంగా శుక్రవారం గిరిజనలు, అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియామకం అయిన తర్వాత హుస్సేన్ మొదటిసారిగా మానుకోటకు వచ్చారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని గణపురం గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సన్మానసభలో గరికపాటి మోహన్‌రావు హాజరై మాట్లాడారు. ఇప్పటి వరకు గిరిజనలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రం నుంచి గత ప్రభుత్వాలు ఎటువంటి అవకాశాలు కల్పించలేదన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యులుగా ముగ్గురిలో తెలంగాణ రాష్ట్రం నుంచి హుస్సేన్ నాయక్‌కు పదవీ దక్కడం అదృష్టమన్నారు. అభియానులు, నాయకులు హుస్సేన్‌నాయక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్, నాయకులు ప్రదీప్‌రావు, సుధాకర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్ శర్మ పాల్గొన్నారు.


సన్మానం చేస్తున్న నాయకులు

'దందాలు చేసే సంస్కృతి ఝాన్సీరెడ్డికి లేదు'


మాట్లాడుతున్న హరిప్రసాద్‌రావు

తొర్రూరు: పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే తప్ప, ఇసుక, భూములు, గ్రానైట్స్ వంటి దందాలు చేసే సంస్కృతి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డికి లేదని డీసీసీబీ డైరెక్టర్ కాకిరాల హరిప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అమెరికాలో నిజాయితీగా సంపాదించుకొని, అందులో కొంత నియోజకవర్గ ప్రజలకు ఖర్చు పెట్టేందుకే రాజకీయాలకు వచ్చారన్నారు. తన కోడలును ఎమ్మెల్యేగా గెలిపించి, నిరంతరం ప్రజా సేవ కార్యక్రమాలతోపాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం పని చేస్తుందన్నారు. ఈసమావేశంలో కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, అనుమాండ్ల తిరుపతిరెడ్డి, సుంచు సంతోష్, సోమరాశేఖర్, శ్యాంసుందర్‌రెడ్డి, పెదగాని సోమయ్య, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశంగౌడ్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్‌లో మెస్, కాస్మోటిక్ ఇతర పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా కన్వీనర్ కమిటీ సభ్యులు సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యావసర ధరలు రోజురోజుకు పెరుగుతున్న విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి అన్నిహాస్టల్‌లో ఉన్న పెండింగ్ బిల్లులు మంజూరు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ పట్ల మధు, సభ్యులు సూర్య, జ్యోతిబసు, సింహాద్రి, హస్మం, రాకేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిరణ్

ఎమ్మెల్యేపై విమర్శలు అర్థరహితం


కురవి: మాట్లాడుతున్న రజనీకాంత్

డోర్నకల్/మరిపెడ/కురవి/దంతాలపల్లి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్‌పై కొంత మంది చేస్తున్న విమర్శలు అర్థరహితమని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజనీకాంత్, కురవి కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు రాజేందర్ కుమార్, కాంగ్రెస్ నాయకులు రెడ్డెబోయిన శంకర్, గంధసిరి అంబరీష అన్నారు. శుక్రవారం వారు వేర్వేరు సమావేశాల్లో మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచి మూడు నెలలుగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తున్న ఎమ్మెల్యేను కొంతమంది ఉద్దేశపూర్వకంగా విమర్శిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ విజయం సాధించిన తర్వాత నియోజకవర్గంలో రూ.20కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. స్థాయి లేని వ్యక్తులు, ఉనికిని కాపాడుకునేందుకే విమర్శలు చేస్తున్న వారికి సరైన సమయంలో బుద్ధి చెబుతామని తెలిపారు.

ఇంట్లో చోరీ

డోర్నకల్: స్థానిక సుభాష్‌వీధిలోని ఓ ఇంట్లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సుభాష్‌వీధికి చెందిన పెండ్యాల రాజేష్ కొద్ది రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లాడు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గడ్డపారతో ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. రెండు గదుల్లోని బీరువాలను తెరిచి దుస్తులతోపాటు ఇతర సామగ్రిని బయట పడేశారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఏ వస్తువులు చోరీకి గురయ్యాయనే విషయం తెలియరాలేదు. పోలీసులు ఇంటిని పరిశీలించగా స్థానికులు ఇంటి యజమానికి సమాచారం అందించారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి రిమాండ్

మహబూబాబాద్ రూరల్: కుటుంబ తగాదాల కారణంగా జరిగిన ఘర్షణ, హత్యాయత్నం కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని బెస్త బజారుకు చెందిన మల్లం మురళీకృష్ణ, మల్లం వంశీకృష్ణ మధ్య ఉన్న కుటుంబ తగాదాల కారణంగా మురళీకృష్ణ ఇంటిపై వంశీకృష్ణ, అతడి మిత్రుడు గట్ల జగదీష్ కుమార్ కలిసి హత్య చేయబోయారని మురళీకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపి వంశీకృష్ణ, జగదీష్ కుమార్‌ను రిమాండ్‌కు తరలించామని సీఐ పేర్కొన్నారు.

సంతాపం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి దివంగత శ్రీరంగం బుచ్చయ్య సతీమణి వెంకటమ్మ (94) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్, ఖమ్మం ఏసీపీ సాదుల సారంగపాణి, ఏడీఏ సతీష్ తదితరులు వారి నివాసానికి వచ్చి వెంకటమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్థికసాయం

కేసముద్రం: మండల కేంద్రం శివారు బ్రహ్మంగారి తండాలో ఆటో డ్రైవర్ మహమ్మద్ అజంఖాన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు శుక్రవారం ముస్లిం కుల సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.7,500, 50కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు షేక్ ఖాదర్, అఫీజ్, నయీమ్, అక్బర్, సుభాని, జావిద్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


గార్ల: సేరిపురం గ్రామంలో బెల్లంపానకం ధ్వంసం చేస్తున్న పోలీసులు

గార్ల: మండలంలోని సేరిపురం గ్రామంలో గుడుంబా స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడులు చేసి 30లీటర్ల గుడుంబా, 300 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేసినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. సేరిపురం గ్రామానికి చెందిన గూగులోత్ మాలు ఇంట్లో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్నాడనే పక్కా సమాచారం మేరకు దాడి చేసి అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై జీనత్‌కుమార్, కానిస్టేబుళ్లు శ్రీను, మంగీలాల్, శ్రీనివాస్, రాము, భద్రు పాల్గొన్నారు.

బయ్యారం: మండలంలోని చుంచుబంధం తండాలోని గుడుంబా స్థావరాలపై శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో గుడుంబాకు తయారీకి సిద్ధంగా ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐలు చిరంజీవి, నీరజ, ఎస్సైలు అశోక్, కీర్తి, మౌనిక పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బయ్యారం: ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి అన్నారు. బయ్యారం బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ధర్మాపురం పాఠశాల ఉపాధ్యాయులు శంకరయ్య పదవీ విరమణ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన గ్రాట్యూటీ, కమ్యూనికేషన్ సర్వీస్ బెనిఫిట్స్‌ను సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, టీపీటీఎఫ్ నాయకులు మనోహర్‌రాజు, శ్రీశైలం, ఉప్పలయ్య, లక్ష్మినారాయణ, మీరా, ప్రవీణ్‌కుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


శంకరయ్య దంపతులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చూపించాలి

కొడకండ్ల: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి అన్ని నియోజకవర్గాలకంటే భారీ మెజార్టీని అందించి పాలకుర్తి నియోజకవర్గ సత్తా చాటాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. శుక్రవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో రేగుల మాజీ సర్పంచ్ కల్సాని వెంకట్‌రెడ్డితో పాటు వివిధ గ్రామాల నుంచి 100 మంది బీఆర్ఎస్ పార్టీ నుంచి ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ ఆడబిడ్డలుగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, తాను నిత్యం తోడు నీడగా ఉంటామన్నారు. పార్టీలో కొత్త పాత తేడా లేకుండా అందరు కలిసికట్టుగా పార్టీ అభ్యున్నతికి పాటుపడాలన్నారు. చేరికలు కేవలం నూతన ఉత్సాహాన్ని తీసుకొచ్చి పార్టీ అభివృద్ధికి దోహదపడుతాయనే తప్ప పార్టీ కోసం గత అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు అన్యాయం చేయడం కోసం ఏమాత్రం కాదన్నారు. కష్టపడి పనిచేసిన వారందరికి సముచిత గౌరవం, గుర్తింపునిస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. కుటుంబాన్ని సైతం వదిలేసి పాలకుర్తి ప్రజల మధ్యంలో ఉంటున్నామని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుపాలన్నదే తమ ఏకైక సంకల్పమని అన్నారు. కార్యక్రమంలో రాజేష్‌నాయక్, సోమనర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి అండగా ఉంటాం..

పాలకుర్తి: బీఆర్ఎస్ ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్‌లు, పార్టీ గ్రామ అధ్యక్షులు ఇతర నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కాగా, వారికి యశస్వినిరెడ్డి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ రాఘవరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

నర్సంపేట: క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు, కౌన్సిలర్ శీలం రాంబాబు తెలిపారు. పట్టణంలోని తలపెట్టిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన టాస్ వేసి ప్రారంభించి మాట్లాడారు. యువత చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ నైపుణ్యత పెంచుకోవాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని చెప్పారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ మాట్లాడుతూ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు శీలం అయోధ్య జ్ఞాపకార్థం ప్రథమ బహుమతిగా రూ.40 వేలతోపాటు షీల్డ్ అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోల్యానాయక్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కొంపెల్లి రాజు, గూడూరు సందీప్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల రాము, సీనియర్ నాయకుడు కూనమల్ల పృథ్వీరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నూనె రంజిత్, యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు అచ్చ దయాకర్, ప్రధాన కార్యదర్శి భవానీ శంకర్, యువమోర్చా ఉపాధ్యక్షుడు కోమల సప్తగిరి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మహబూబాబాద్ రూరల్: పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ తండ్రి సంకా సత్యనారాయణ దశదిన కర్మ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వాణిజ్య, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రామచంద్రునాయక్, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, డాక్టర్ సీతామహాలక్ష్మి, తదితరులు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, తదితరులు